నమస్తే తెలంగాణ
నిజామాబాద్
3 | నిజామాబాద్, బుధవారం 14 ఆగస్టు 2024 | NIZAMABAD

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాన్సువాడ నాయకులు, పక్కన బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

బాన్సువాడలో ఉప ఎన్నికలు ఖాయం

- పార్టీ మారిన పోచారం శ్రీనివాసరెడ్డికి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారు
- బాన్సువాడ నియోజకవర్గ పార్టీ శ్రేణులతో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బాన్సువాడ, ఆగస్టు 13: బాన్సువాడ నియోజకవర్గానికి ఉప ఎన్నికలు రావడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పార్టీ మారిన పోచారం శ్రీనివాసరెడ్డికి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారన్నారు. బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన పార్టీ శ్రేణులు మంగళవారం హైదరాబాద్ తరలివెళ్లి.. కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారితో కేటీఆర్ మాట్లాడుతూ పోచారం శ్రీనివాసరెడ్డిని అన్ని రకాలుగా గౌరవించినా.. బీఆర్ఎస్‌ను వీడడం ఆయనకే నష్టమని అన్నారు. కార్యకర్తల కష్టం మీద గెలిచి... స్వార్థం కోసం పార్టీని వీడడం కార్యకర్తలను బాధించిందన్నారు. కష్టకాలంలో పార్టీకి ద్రోహం చేసిన వాళ్లు ఎంత పెద్దవారైనా వదిలిపెట్టేది లేదని, వారికి కచ్చితంగా కార్యకర్తలు బుద్ధి చెబుతారని కేటీఆర్ హెచ్చరించారు. కాంగ్రెస్‌లోకి వెళ్లిన తర్వాత పోచారం శ్రీనివాసరెడ్డిని కనీసం అడిగిన వాళ్లు కూడా లేని దయనీయ పరిస్థితి వచ్చిందన్నారు. రేవంత్‌రెడ్డి పరిపాలన సమర్థత ఏంటో ప్రజలకు తెలిసిపోయిందని, మార్పు పేరుతో జనాన్ని ఏమారుస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. బాన్సువాడ ఉపఎన్నికల్లో కచ్చితంగా పోచారాన్ని ఓడిస్తామని చెప్పారు. త్వరలోనే మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ఇతర పార్టీ సీనియర్ నాయకులతో కలిసి బాన్సువాడకు వచ్చి పార్టీ శ్రేణులతో సమావేశమవుతామని హామీ ఇచ్చారు. పార్టీని మోసం చేసి నాయకులు వెళ్లిపోయినప్పటికీ కార్యకర్తలు మాత్రం పార్టీని వీడలేదని, బీఆర్ఎస్‌కు కార్యకర్తలే కొండంత అండ అన్నారు. అధికార పార్టీ ఇబ్బందులకు గురిచేస్తే అండగా ఉంటామని, అన్ని అస్త్రాలు తమ దగ్గర ఉన్నాయని, అవసరం మేరకు వదులుతామన్నారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు షేక్ జుబేర్, సాయిలు, మోచి గణేశ్, మహేశ్, ఫారూక్ ఉన్నారు.

హైదరాబాద్‌లోని తన నివాసంలో బాన్సువాడ బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడుతున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

దవాఖానలోని ఓపీ విభాగం వద్ద కిక్కిరిసిన జనం

నమస్తే తెలంగాణ ఫీల్డ్ విజిట్

రోగుల తాకిడి ఎక్కువ... సౌకర్యాలు తక్కువ
లోపిస్తున్న పారిశుద్ధ్యం.. సరైన ఏర్పాట్లు లేక వరండాల్లో వైద్యం
ఇబ్బందులు పడుతున్న ప్రజలు

నేను రాను బిడ్డో

సర్కారు దవాఖానకు..

ప్రజల అనారోగ్యాన్ని తగ్గించి.. ఆరోగ్యంగా తీర్చిదిద్దాల్సిన ఏరియా దవాఖాన.. సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నది. ఓపీ గదుల్లో డాక్టర్లు, బాధితులు ఊపిరాడక అల్లాడుతున్నారు. దవాఖాన వరండాల్లో వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో సర్కారు వైద్యానికి కేసీఆర్ జవసత్వాలు తెస్తే.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలవుతున్నా మందుగోళీలకు దిక్కులేని పరిస్థితి వచ్చింది. చలో పోదాం సర్కారు దవాఖానకు అనే భీమా నుంచి నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు అనే దుస్థితి వచ్చింది.

– కామారెడ్డి,ఆగస్టు 13

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఏరి యా దవాఖానలో పేదలకు వైద్యం అందించడం, మందులు, సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. కనీస సౌకర్యాలు లేక ఓపీ పక్కనే వైద్యం చేస్తున్నారు. ఓపీ వద్ద సరైన స్థలం లేక చాలా మంది క్యూలైన్‌లో నిల్చుంటున్నారు. గర్భిణులు సైతం పరీక్షల కోసం నిలబడాల్సిన పరిస్థితి ఉన్నది. కామారెడ్డి ఏరియా దవాఖానకు చుట్టు పక్కల ఉన్న గ్రామాల నుంచి వందలాది మంది రోగులు వస్తుంటారు. అయినా సరైన సౌకర్యాలు కల్పించడం లేదని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. పురిటి నొప్పులతో రాత్రిపూట గర్భిణులు వస్తే వారికి చికిత్స చేయలేని ఘటనలు చాలావరకు ఉన్నాయి. వైద్యులు రాసిన మందులు దవాఖానలో లభించకపోవడంతో ప్రైవేటు మెడికల్‌కు వెళ్లి కొనుక్కుంటున్నారు. ఎమ్మార్వై, సిటీ స్కాన్‌లను సైతం రోగులు బయటే చేయించుకోవాల్సిన దుస్థితి ఉన్నది. ఇదే అదనుగా భావిస్తున్న ప్రైవేటు సెంటర్లు అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నాయి.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం..

దవాఖానలోని పాలియేటివ్ కేర్ పక్కనే చెత్త, వాడేసిన మందులును పాడేస్తున్నారు. దీంతో దవాఖాన పరిసరాలు అపరిశుభ్రతకు నెలవుగా మారాయి. వాహనాలను పార్కింగ్ చేసేందుకు సరైన స్థలం లేక.. అత్యవసర విభాగం ఎదుటే వాహనాలను నిలుపుతుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

సమస్యల వలయంలో కామారెడ్డి ఏరియా దవాఖాన

ఎక్స్‌రే కోసం బారులుతీరిన రోగులు

దవాఖాన వరండాలోనే రోగికి సెలైన్ పెట్టిన వైద్యసిబ్బంది

వైద్యులు ఉన్నప్పటికీ సరైన స్థలం లేదు

జిల్లా ఏరియా దవాఖానలో వైద్యుల కొరత లేదు. కానీ, సరైన స్థలం లేక రోగులకు ఇబ్బంది అవుతుంది. దవాఖానను కొంత వరకు విస్తరిస్తే రోగులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. దవాఖానలో కొన్ని మందులు లేకపోతే బయటి మెడికల్‌కు రాస్తున్నాం.

-డా.రామ్‌సింగ్, సూపరింటెండెంట్, జిల్లా ఏరియా దవాఖాన, కామారెడ్డి

మందులు లేవంటున్నరు..

మాది తాడ్వాయి మండలం చందాపూర్ గ్రామం. నా భార్య కీళ్లనొప్పులని మా గ్రామానికి దగ్గరగా ఉన్న ఎర్రపహాడ్ ప్రభుత్వ దవాఖానకు వెళితే కామారెడ్డి ఏరియా దవాఖానకు రాసిచ్చిండ్రు. కానీ, ఇక్కడ వైద్యం చేయడంలో నిర్లక్ష్యం చేస్తుండ్రు. మందులు కూడా లేవని చెబుతున్నరు.

-రాజయ్య, చందాపూర్

- ప్రేయసితో పాటు ఆమె మైనర్ చెల్లిని తీసుకెళ్లిన యువకుడు
- తల్లిదండ్రుల ఫిర్యాదుతో కిడ్నాప్ కేసు
- ఠాణాకు వచ్చి ప్రియుడి ఆత్మహత్యాయత్నం
- భయపెట్టేందుకే సీన్ క్రియేట్ చేశాడని అనుమానం

ఠాణాలో యువకుడి ఆత్మహత్యాయత్నం

వినాయక్‌నగర్, ఆగస్టు 13: ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ యువకుడు ప్రియురాలితో పాటు ఆమె చెల్లి(మైనర్)ని తీసుకెళ్లిపోయాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేశారు. విషయం తెలిసిన సదరు యువకుడు ఠాణాకు వచ్చి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నిజామాబాద్ సౌత్ రూరల్ సర్కిల్‌లోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం చోటు చేసుకున్న ఈ ఘటన కలకలం రేపింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. మెదక్ జిల్లాకు చెందిన రమేశ్ (22)కు, నిజామాబాద్ శివారులోని ముబారక్‌నగర్‌కు చెందిన ఓ యువతితో పరిచయం ఏర్పడింది. ఇద్దరు మేజర్లు కావడంతో ఇటీవల ఆర్యసమాజ్‌లో వివాహం చేసుకున్నారు. జూలై 30వ తేదీన నిజామాబాద్‌కు వచ్చిన రమేశ్.. ప్రియురాలితో పాటు ఆమె చెల్లెలు(మైనర్)ను తీసుకుని వెళ్లిపోయాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు రూరల్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆగస్టు 1న రమేశ్‌పై కిడ్నాప్ కేసు నమోదు చేశారు. విషయం తెలిసిన రమేశ్ యువతితో పాటు బాలికను, బంధువులను తీసుకుని మంగళవారం రూరల్ స్టేషన్‌కు వచ్చాడు. అయితే, క్రైమ్ మీటింగ్ ఉండడంతో ఎస్సై మహేశ్ ఉదయమే వెళ్లారు. అక్కడి సిబ్బంది ఎస్సై వచ్చాక మాట్లాడుతారని వారిని స్టేషన్‌లో కూర్చోబెట్టారు. అయితే, సాయంత్రం వరకూ అక్కడే ఉన్న రమేశ్.. యువతి చున్నీ తీసుకుని ఓ గది లోకి వెళ్లాడు. అక్కడున్న కిటికీకి చున్నీ బిగించి ఉరేసుకునేందుకు యత్నించగా, గమనించిన సిబ్బంది హుటాహుటిన వెళ్లి అడ్డుకున్నారు. ఉన్నతాధికారులకు సమాచారమిచ్చి యువకుడ్ని దవాఖానకు తరలించారు. భయపెట్టేందుకే నిందితుడు ఆత్మహత్య పేరుతో సీన్ క్రియేట్ చేసినట్లు పోలీసులు చెబుతున్నారు.

రుణమాఫీ చేయించండి మహాప్రభో..

ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ కాలేదంటూ రెంజల్ మండలానికి చెందిన పలువురు రైతులు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డితో మంగళవారం మొర పెట్టుకున్నారు. రెంజల్ కెనరా బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యంతోనే మాఫీ కాలేదని, మాఫీ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో వెంటనే కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రుణమాఫీ కాని రైతుల జాబితాను తయారుచేసి ప్రభుత్వానికి పంపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

– రెంజల్,ఆగస్టు 13

కార్పొరేషన్ చైర్మన్లకు జెండావిష్కరణ బాధ్యతలు

'గౌరవం' దక్కని ప్రజాప్రతినిధులు

నిజామాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పంద్రాగస్టుకు జెండా ఆవిష్కరణ చేసే ముఖ్య అతిథులను రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో జరిగే వేడుకలకు ముఖ్య అతిథిగా ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, కామారెడ్డిలో జరిగే వేడుకలకు తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. కానీ, ఉమ్మడి జిల్లాలో దశాబ్దాలపాటు ఎమ్మెల్యేలుగా కొనసాగుతూ మంత్రులుగా వివిధ హోదాల్లో పనిచేసిన వ్యక్తులను కాదని, కార్పొరేషన్ చైర్మన్లకు జెండా ఆవిష్కరణ అవకాశం కల్పించడంపై ప్రజల్లో చర్చ జరుగుతున్నది. నిజామాబాద్‌లో సీనియర్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీకి చెందిన సుదర్శన్‌రెడ్డి, కామారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఇద్దరు కొత్త ఎమ్మెల్యేలు, వీరికి తోడుగా ఈమధ్యే పార్టీ మారిన పోచారం శ్రీనివాసరెడ్డి కూడా ఉన్నారు. వీరెవ్వరికీ జెండా ఆవిష్కరణ అవకాశం రాకపోవడం శోచనీయం.

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

డీఈవో దుర్గాప్రసాద్

నీలాలో రికార్డులను పరిశీలిస్తున్న డీఈవో

రెంజల్, ఆగస్టు 13: ఆదేశాలను బేఖాతరు చేస్తూ విధుల్లో నిర్లక్ష్యం వహించే ఉపాధ్యాయులపై శాఖా పరమైన చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ హెచ్చరించారు. నమస్తే తెలంగాణ దినపత్రికలో 'చదువు లెట్ల సాగాలె..' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి డీఈవో స్పందించారు. కందకుర్తి ఉర్దూ మీడియం పాఠశాలకు వారం క్రితం డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయులను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా ఇద్దరు ఉపాధ్యాయులు పెడచెవిన పెట్టడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేసే నీలా ప్రాథమిక పాఠశాలను డీఈవో దుర్గాప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. తమ ఆదేశాలను తక్షణమే పాటించాలని ఆదేశించారు. కందకుర్తి ఉర్దూ మీడియం పాఠశాలకు డిప్యుటేషన్‌పై కేటాయించిన నలుగురు ఉపాధ్యాయులు విధుల్లో చేరుతారని, మరో ఉపాధ్యాయుడిని సైతం నియమించి కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని డీఈవో తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం, కేజీబీవీ రికార్డులను పరిశీలించారు.

మెరుగైన సేవలందించాలి

ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
బోధన్ జిల్లా జిల్లా దవాఖాన తనిఖీ

రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

శక్కర్‌నగర్, ఆగస్టు 13: బోధన్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ దవాఖానలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి వైద్యాధికారులను ఆదేశించారు. 'వరం డాల్లో.. వైద్యం' అనే శీర్షికన నమస్తే తెలంగాణలో ప్రచురితమైన వార్తకు స్పందించిన ఆయన మంగళవారం దవాఖానను సందర్శించారు. వివిధ వార్డులు, డయాలసిస్, ఇన్‌పేషెంట్ తదితర విభాగాలను పరిశీలించారు. దవాఖానలో నెలకొన్న పరిస్థితులు, సమస్యలను ఆయన గుర్తించారు. ప్రజలు, రోగులతో మాట్లాడి వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. డయాలసిస్ విభాగాన్ని కిందికి మార్చాలని ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌కు సూచించారు. నర్సింగ్ విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ జిల్లా దవాఖానలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని, త్వరలోనే వైద్యులను నియమిస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సుమంత్, ఆర్ఎంవో సోఫి, వైద్యులు సందీప్, విష్ణుశ్, ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, తహసీల్దార్ విఠల్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

బాలికల వసతి గృహంపై

ఏసీబీ దాడులు

- వసతులు నిల్.. భోజనంలో నాణ్యత డొల్లా..
- హాజరు, బిల్లుల్లో అవకతవకలు బహిర్గతం
- ఆహార పదార్థాల నమూనాల సేకరణ.. ల్యాబ్‌కు తరలింపు
- ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్

వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ

ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న అధికారులు

వినాయక్‌నగర్, ఆగస్టు 13: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కోటగల్లిలో ఉన్న ప్రభుత్వ ఎస్సీ బాలిక వసతి గృహంపై మంగళవారం ఉదయం 6గంటలకు అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు చేశారు. ఏసీబీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా వసతి గృహాలపై నిర్వహించిన దాడుల్లో భాగంగా నిజామాబాద్‌లో తనిఖీలు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ వెల్లడించారు. ఏసీబీ అధికారులతోపాటు తూనికలు కొలతలు, మున్సిపల్ సానిటైజ్, ఫుడ్ సేఫ్టీ శాఖల అధికారులు ఏకకాలంలో దాడులు చేశారు. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం పెడుతున్నారా లేదా? ప్రభుత్వం నుంచి వారికి వచ్చే నోట్ పుస్తకాలు, దుప్పట్ల పంపిణీ సక్రమంగా ఉందా అనే కోణంలో పరిశీలించారు. కొందరు విద్యార్థులతో స్వయంగా మాట్లాడి హాస్టల్‌లో ఉన్న వసతులపై వివరాలను సేకరించారు. విద్యార్థులకు వండి పెట్టేందుకు ఉపయోగించే వంట పదార్థాలు ఎంత మేరకు నాణ్యత కలిగి ఉన్నాయో తెలుసుకునేందుకు ఫుడ్ సేఫ్టీ అధికారులు నమునాలను సేకరించడంతోపాటు భోజనంలో నాణ్యత లోపించినట్లు గుర్తించారు. అనంతరం అధికారులు, సిబ్బందికి సంబంధించి హాజరు రిజిస్టర్‌ను పరిశీలించగా అవకతవకలు బయటపడ్డాయి. వస్తువుల కొనుగోళ్లలో అక్రమాలు జరిగినట్లు అధికారులు గుర్తించారు.

అవకతవకలు గుర్తించాం..

తాము నిర్వహించిన దాడుల్లో వసతి గృహంలో పలు అవకతవకలను గుర్తించామని ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ వెల్లడించారు. విద్యార్థులకు పెట్టే భోజనానికి ఉపయోగించే పదార్థాల్లో నాణ్యత లోపించిందని గుర్తించి నమూనాలు సేకరించామన్నారు. వాటిని పరీక్షల కోసం హైదరాబాద్‌లోని నాచారం ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. వసతిగృహంలో బాత్‌రూమ్‌లు సక్రమంగా లేవని, విద్యార్థుల గదుల్లో లైట్లు, ఫ్యాన్లు సైతం సరిగా లేవని పేర్కొన్నారు. మొత్తం నివేదికను ఏసీబీ డీఐజీకి అందజేస్తామని, అనంతరం బాధ్యులపై చర్యలు ఉంటాయని వెల్లడించారు.